




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 30-11-2024

సంపుటి: 20 సంచిక: 210

పేజీలు: 4 వెల: రూ.1




# నగరంలో మహా విషాదం!

- రోడ్డు ప్రమాదంలో నలుగురు సిక్కోలువాసులు మృతి
- శనివారం ఉదయాన్నే గాలిలో కలిసిపోయిన ప్రాణాలు
- మృతులంతా ప్రముఖుల కుటుంబీకులే







ప్రమాదంలో మృతిచెందిన కౌశిక్, వడ్డి అభినవ్-మణిమాల, డ్రైవర్ జయేశ్

**శ్రీకాకుళం నగరం శనివారం ఉదయాన్నే విషాదకరమైన వార్తతో కళ్లు నులుముకుంది. నగరానికి చెందిన నలుగురు యుక్తవయసువారు కారు ప్రమాదంలో మృతిచెందారు. ఇందులో ఒక యువతి కూడా ఉండటం మరింత విషాదకరం. వివరాల్లోకి వెళితే..**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విజయనగరం జిల్లాపరిధి జాతీయ రహదారి పోలిపల్లి వద్ద లారీ, కారు ఢీకొనడం ద్వారా నగరానికి చెందిన నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు వెళు_న్న ఫార్చ్యూనర్ కారు టైరుకు పంక్చర్ కావడంతో డివైడర్‌ను ఢీకొట్టి విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న లైన్‌లో పడి పడింది. అప్పటికే అటువైపుగా వస్తున్న లారీ కారును ఢీకొట్టడంతో అక్కడికక్కడే నలుగురూ మృతిచెందారు. మృతుల్లో నగరానికి చెందిన గవిడి కౌశిక్, వడ్డి అభినవ్, వడ్డి మణిమాల, డ్రైవర్ మొడి జయేశ్ ఉన్నారు. ప్రముఖ కాపు నాయకులు లంక బావాజీనాయుడి కూతురు కొడుకు (మనుమడు) పెళ్లి డిసెంబరు 6న ఉండటంతో ఆయన కుమారుడు అమెరికా నుంచి శ్రీకాకుళం వస్తున్నారు. ఎయిర్‌పోర్టులో ఆయన్ను రిసీవ్ చేసుకోడానికి శ్రీకాకుళం నుంచి శనివారం ఉదయం బావాజీనాయుడి అల్లుడు గవిడి వాసు కొడుకు గవిడి కౌశిక్ తన ఫార్చ్యూనర్ వాహనంలో బయల్దేరారు. గవిడి వాసు లంక బావాజీనాయుడుకు అల్లుడు. దీంతో మేనమామను తెచ్చేందుకు కౌశిక్ విశాఖపటనం బయల్దేరాడు. శుక్రవారం రాత్రి తాను విశాఖ వెళ్తున్నట్టు మిత్రుడు అభినవ్‌కు చెప్పడంతో విశాఖపట్నంలో తన భార్యకు పరీక్ష ఉందని, తామిద్దరం వస్తామంటూ కౌశిక్ మిత్రుడు వడ్డి అభినవ్ (27), తన భార్య మణిమాలతో కలిసి ఇదే ఫార్చ్యూనర్ ఎక్కారు. సరిగ్గా పోలిపల్లి రహదారి వద్దకు వచ్చేసరికి టైర్ పంక్చర్ కావడంతో వేగంగా వెళుత్న వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఎదురుగా వస్తున్న లారీ కూడా ఢీకొనడంతో నలుగురి ప్రాణాలూ గాలిలో కలిసిపోయాయి. అభినవ్ నగరంలో లియో మెడికల్స్ పేరుతో ల్యాబ్ నిర్వహిస్తున్న వడ్డి మన్మధ కుమారుడు. ఈయన తండ్రితో పాటు నగరంలో లియో ల్యాబ్‌ను నడిపిస్తున్నాడు. ఈయనకు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ఇక గవిడి కౌశిక్ తండ్రి గవిడి వాసుదేవరావు కూడా పేర్లవారి సందులో బంగారం వ్యాపారం చేస్తున్నారు. నగరంలో మరో ప్రముఖ నగల వ్యాపారి లంక గాంధీ కుమార్తెతో ఏడాది క్రితమే కౌశిక్‌కు వివాహం జరిగింది. బంగారం వ్యాపారంలో లంక గాంధీకి పెద్ద పేరు ఉంది. మరోవైపు గవిడి వాసు కూడా బంగారం వర్తకుల సంఘంలో కీలకంగా ఉన్నారు. ఇటువంటి కుటుంబం నుంచి కౌశిక్, మన్మధ కుటుంబం నుంచి కొడుకు, కోడలు మరణించడంతో నగరం మొత్తం దిగ్భ్రాంతికి గురైంది. ఇక ఈ కారుకు డ్రైవర్‌గా పని చేస్తున్న మొడి జయేశ్ తల్లి స్థానిక సున్నపువీధి జంక్షన్ వద్ద టీకొట్టు నడుపుతోంది. తండ్రి లేని జయేశ్ చిన్నవయసులోనే పెద్ద వాహనాలను సేఫ్‌గా నడిపే డ్రైవర్‌గా పేరు తెచ్చుకున్నాడు. 2005లో పుట్టిన జయేశ్‌కు తల్లి తప్ప మరొకరు లేరు. ఆ తల్లికి కూడా జయేశే ఆధారం. ఇప్పుడు కొడుకు చనిపోవడంతో ఆ తల్లి దిక్కుతోచని పరిస్థితికి వెళ్లిపోయింది.




• ఎడిటోరియల్

# మూకుమ్మడి చైతన్య ఫలితం

ఎవరూ పెద్దగా విశ్లేషణలకు పోవడంలేదు గానీ.. ఇథనాల్ ఫ్యాక్టరీని తరలిస్తాం లేదా రద్దు చేస్తాం అనే తెలంగాణ ప్రభుత్వ ప్రకటనకు ప్రాధాన్యం ఉంది. జనమంతా ఒక్కటై తిరగబడితే ప్రభుత్వాలు వెనక్కి తగ్గకతప్పదని చెప్పే తాజా ఉదాహరణ ఇది. ఆ ఫ్యాక్టరీ వల్ల నాలుగైదు గ్రామాలు సమస్యలు ఎదుర్కొంటాయి. అన్ని ఊళ్లూ ఏకమయ్యాయి. ఆడా మగా పిల్లా పీచూ అందరమూ కలిసి బైఠాయించారు. పోలీసులపైకి రాళ్లు విసరడం, ఆర్డీవో సహా అధికారులను గంటల తరబడి నిర్బంధించడాన్ని మనం సమర్థించలేం గానీ.. ప్రజల్లో రగులుతున్న కోపానికి అది ఓ సూచిక. తెలంగాణ లగచర్లలో కలెక్టర్‌పై దాడి, దిలావర్‌పూర్‌లో ఆర్డీవో నిర్బంధం, పోలీసులపై దాడి వంటి సంఘటనలు సొసైటీలో నిర్బంధ భూసేకరణ, కాలుష్య కారక పరిశ్రమల పట్ల జనంలో పెరుగుతున్న అసహన తీవ్రతను సూచిస్తున్నాయి. ప్రజాభిప్రాయానికి భిన్నంగా వెళ్తే చూసీ చూసీ జనం ఎలా తిరగబడతారో ఇది తెలియజేస్తుంది. లగచర్లలో జనవ్యతిరేకతను అణిచేయడానికి ప్రయత్నించిన ప్రభుత్వం దిలావర్‌పూర్‌లో ఎందుకు తగ్గింది..? లగచర్ల అల్లర్ల వెనుక ప్రతిపక్షం ఎగదోస్తున్నదనే భావన కావచ్చు. అది ప్రభుత్వ భూసేకరణ పట్ల వ్యతిరేకత కాబట్టి కఠినంగా వ్యవహరించి ఉంటుంది. అదీ కరెక్టు కాదు, పరిహారం విషయంలో చర్చించి, నచ్చజెప్పి ఉండాల్సింది కానీ ఈ ఇథనాల్ కథ వేరు. అది ప్రైవేటు ఫ్యాక్టరీ. భూసేకరణ కాదు, అది తమ గ్రామాలకు అరిష్ట కాలుష్య కారకమని జనం వ్యతిరేకత. లగచర్ల వేరు. ఈ ఇథనాల్ బీఆర్ఎస్ మాజీ మంత్రి తలసాని కుటుంబానిది అని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. తన అల్లుడు, తన కొడుకు భాగస్వాములుగా ఉన్న పీఎంకే డిస్టిలేషన్స్ ఏర్పాటు చేసే ఫ్యాక్టరీ అట. ఓ ప్రైవేటు ఫ్యాక్టరీ కోసం.. అదీ బీఆర్ఎస్ నాయకుడి కుటుంబానికి సంబంధించిన ఫ్యాక్టరీ కోసం ప్రజావ్యతిరేకతను తను ఎందుకు ఫేస్ చేయాలనే భావనతో ప్రభుత్వం కూడా లైట్ తీసుకుని, తరలిస్తాం లేదా రద్దు చేస్తాం అనే స్పష్టమైన ప్రకటన చేసి ఉంటుంది. తరలిస్తే, వేరే గ్రామాల్లో కూడా ఇవే పునరావృతమవుతాయి కదా. సో, రద్దు చేయడమే పరిష్కారమేమో, లేదా జనావాసాలకు దూరంగా, అన్నిరకాల కాలుష్య నివారణ జాగ్రత్త చర్యల పరిమితులు పెట్టి అనుమతించడం బెటరేమో. అయితే, తమ కుటుంబానికి ఆ ఫ్యాక్టరీతో సంబంధం లేదని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ఖండించారు. సరే, ఆ వివాదాలు, విమర్శలు, ఖండనల మాటెలా ఉన్నా, నిజానిజాల మాటెలా ఉన్నా, జనంలో కనిపించిన మూకుమ్మడి చైతన్యం కచ్చితంగా విశేషమే. ఆ తిరుగుబాటు వెనుక ఎవరున్నారు అని కాదు ప్రధానం.. తమ ప్రయోజనాల రక్షణకు పల్లెలు తిరగబడి విజయం సాధించడమే అసలు విశేషం..!! దిలావర్‌పూర్‌లోను, లగచర్లలోను ప్రభుత్వం వెనుకకు తగ్గింది. ఇందుకు ఉద్యమకారులైన ప్రజలను, ఆలస్యంగా అయినా ప్రజల స్పందనను గుర్తించినందుకు ప్రభుత్వాన్ని అభినందించాలి. గ్రీన్, వైట్, కాకపోతే మూడు రంగుల ఫార్మా లేదా ఇథనాల్ పేరుతో ప్రభుత్వం కొత్త ఎత్తుగడతో ముందుకు వచ్చే ప్రమాదం లేదా అంటే, అటువంటి అవకాశం ఎప్పుడూ ఉంటుంది. మరింత నిర్బంధంతో విరుచుకుపడే ఎత్తుగడా ఎదురుకావొచ్చు. దక్కిన విజయాన్ని గుర్తించకుంటే, దానిని కాపాడుకోవడం కూడా చేయలేము. ఇది అయితే ప్రజా విజయం అవుతుంది. దానితో పాటు ప్రభుత్వం చేసుకున్న నష్ట నివారణ అవుతుంది. అంతే తప్ప, మధ్యలో బిఆర్ఎస్ సంబరపడదానికి ఏమీ లేదు. భుజాలు తడుముకోవాలి తప్ప, చరుచుకోగూడదు. లగచర్ల, దిలావర్ పూర్ విజయాలు తమ గెలుపులైనట్టు బిఆర్ఎస్ నేతలు ప్రగల్భించడం హాస్యాస్పదం. రేవంత్ ప్రభుత్వం ప్రజల మీదికి తోలిన విధానాలన్నిటినీ మొదలుపెట్టింది కెసిఆర్ ప్రభుత్వమే. ఇప్పటికీ బిఆర్ఎస్ ఘనకార్యాల నుంచి జనం తేరుకోలేకుండా ఉన్నారు. ప్రజల ఉద్యమాల్లో వీళ్లు తలదూరిస్తే, సమస్యలు పీటముడులు పడడం తప్ప మేలు ఉండడం లేదు. ఆత్రంగా రాజకీయ లాభం పిండుకొనడానికి వీళ్లు చేసే ప్రయత్నాలు, నిర్బంధానికి సమర్థనలుగా పనికివస్తున్నాయి. ప్రజలు పాత ప్రభుత్వం నేరాలను మరచిపోయేదాకా, అంతకుమించిన సంఖ్యలో పాపాలు కొత్త ప్రభుత్వం ఖాతాలో పడేదాకా, జనం సొంతంగా నిర్మించుకుంటున్న ఉద్యమాల జోలికి బిఆర్ఎస్ రాకపోవడం మేలు. అప్పటిదాకా ఎంగేజ్ కావడానికి, రేవంత్‌తో పోటాపోటీగా తిట్లపురాణం వల్లిస్తూ సోషల్ మీడియా లైకులతో తృప్తిపడడం మంచిది. శ్రీకాకుళం జిల్లాలో కూడా సోంపేట బీలభూముల్లో థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుచేయడం కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వస్తే ప్రాణాలు అర్పించి మరీ పోరాటాల పురిటిగడ్డలో కాలుష్య కారక పరిశ్రమను అడ్డుకున్నారు. ఆ తర్వాత సంతబొమ్మాళిలో మరో థర్మల్ విద్యుత్‌ప్లాంట్ కోసం ఉద్యమాలు చేసినా అడ్డుకోలేకపోయారు. లగచర్ల, దిలావర్‌పూర్ల మాదిరిదే సిక్కోలు రైతుల తిరుగుబాటు కూడా.



భారతదేశ రైల్వే చరిత్ర అనేది ఒక విశేషమైన ప్రయాణం. 1853లో ప్రారంభమైన తొలి రైల్వే ప్రయాణం ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద రైల్ నెట్వర్క్‌ను కలిగి ఉంది. ముంబై నుండి థానే వరకు నడిచిన మొదటి రైలు ద్వారా తొలి రైల్వే ప్రయాణం మొదలైంది. అప్పటి నుండి భారతదేశ రైల్వేలు అనేక మార్పులు, అభివృద్ధులను చూసాయి. ప్రతి రోజూ పదిహేను వేల కంటే ఎక్కువ రైళ్లు సుమారు 25 మిలియన్ల ప్రయాణీకులను వారి గమ్యస్థానాలకు చేరుస్తున్న భారతీయ రైల్వేలు 115,000 కిలోమీటర్ల పొడవుతో, తక్కువ ధరలకే ప్రయాణీకులకు సేవలందించే ప్రజారవాణా వ్యవస్థగా పేరుగాంచాయి. ఇంత గొప్ప చరిత్ర కలిగిన రైల్వే వ్యవస్థ మన దేశంలో గత 75 ఏళ్లుగా ప్రయాణికులకు ఉచిత సేవలు అందిస్తున్న రైలు ఒకటి ఉందంటే మీరు ఆశ్చర్యపోతారు. ఈ రైలులో ప్రయాణించడానికి టికెట్ కొనాల్సిన అవసరం లేదు. ఆ రైలులో టీసీ ఉండరు. ఈ రైలులో ప్రయాణించాలనుకునే వారు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఆ రైలు పేరే భాక్రబినంగల్ రైలు. ఈ రైలులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు సేవలన్నీ ఉచితమే. అసలు ఈ రైలులో ప్రయాణం ఎందుకు ఉచితం? ఇది ఎక్కడినుండి ఎక్కడికి ఎంత దూరం ప్రయాణిస్తుంది ? రైలు యొక్క ప్రత్యేకతల గురించి పూర్తి సమాచారం తెలుసుకుందాం.

# ఈ ట్రైన్‌లో.. ప్రయాణం ఫ్రీ!!

రైల్వేలు ప్రారంభంలో ప్రధానంగా బ్రిటిష్ పాలకుల అవసరాలను తీర్చడానికి ఉపయోగించారు. కానీ, కాల క్రమేణా అవి భారతీయుల జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా మారాయి. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారతదేశ రైల్వేలు మరింత విస్తరించాయి. ఆ తరువాత 1951లో అన్ని ప్రైవేటు రైల్వే సంస్థలను ఒకటిగా కలిపి భారతీయ రైల్వేలు ఏర్పడింది. ఈ టైమ్‌లో ఈ రైలు మార్గం భాక్రా-నంగల్ ఆనకట్ట నిర్మాణం కోసం పెద్ద యంత్రాలు, ఇనుము, రాళ్ళు మరియు ఇతర సామగ్రిని రవాణా చేయడానికి ఉపయోగించేవారు. అదే సమయంలో యంత్రాలను సామాగ్రిని తరలించడానికి పెద్ద ఎత్తున ప్రజలు అవసరఉండేది. కావున యంత్రాల సామాగ్రిని ఎగుమతి దిగుమతి చేయడానికి ప్రజలను ఉచితంగా రవాణా చేసేవారు. ఆనకట్ట నిర్మాణం పూర్తయ్యాక ఈ రైలు ఇక్కడి స్థానిక గ్రామాలను కలుపుతూ కొనసాగింది. అయితే ఆనకట్ట నిర్మాణానికి గుర్తుగా అదే సంప్రదాయాన్ని గౌరవిస్తూ దాన్ని ఉచితంగా ఉంచాలని నిర్ణయించారు. అప్పటి నుండి అంటే 1948 నుండి నేటికీ ఈ రైలు క్రమం తప్పకుండా నడుస్తోంది. ప్రస్తుతం ప్రతిరోజూ 1000 మందికి పైగా ఈ రైలును వినియోగిస్తున్నారు. ఈ రైలు కేవలం రవాణా సాధనం మాత్రమే కాదు, చరిత్ర మరియు సంప్రదాయం యొక్క సజీవ భాగం. టికెట్ లేని కారణంగా ఈ రైలులో టిటిఒ ఉండరు. ఈ రైలులో బ్రిటీష్ కాలం నాటి కలపతో తయారు చేసిన కుర్చీలు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి.

ఈ రైలులో టికెట్లు లేకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. దీని నిర్వహణ భాక్రా-బియాస్ మేనేజ్మెంట్ బోర్డు (బీబీఎంబీ) నిర్వహిస్తుంది. గంటకు 18 నుంచి 20 గ్యాలన్ల ఇంధనాన్ని వినియోగించే ఈ రైలుకు టికెట్లు తీసుకోవాలని తొలుత బీబీఎంబీ భావించింది. కానీ ఈ రైలు సంప్రదాయాన్ని గౌరవిస్తూ దాన్ని ఫ్రీగా ఉంచాలని నిర్ణయించారు. ఈ రైలు ప్రతిరోజూ ఉదయం 7:05 గంటలకు నంగల్ రైల్వే స్టేషన్ నుండి బయలుదేరి రాత్రి 8:20 గంటలకు భాక్రా చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో నంగల్ నుంచి మధ్యాహ్నం 3.05గంటలకు బయలుదేరి సాయంత్రం 4.20గంటలకు భాక్రా రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. 13 కిలోమీటర్ల దూరం ప్రయానించే ఈ రైలు మొత్తం ప్రయాణంలో ఐదు స్టేషన్లలో మాత్రమే ఆగుతుంది.

పర్యాటకులు భారతదేశం యొక్క ఎత్తైన ఆనకట్టలలో ఒకటైన భాక్రా-నంగల్ ఆనకట్టతో పాటు అందమైన సత్లాజ్ నది, శివాలిక్ పర్వతాల మీదుగా సాగే ప్రయాణంలో అందమైన ప్రకృతి దృశ్యాలను వీక్షించవచ్చు. ఈ రైలును బాలీవుడ్ సినిమాలో కూడా చూపించారు. సూపర్ స్టార్ రాజేష్ ఖన్నా నటించిన 'చల్తా పుర్జా' సినిమాలో ఈ రైలు సన్నివేశం ఉంది. దీంతో ఇక్కడి ప్రదేశాలను వీక్షించడానికి సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. 60 ఏళ్ల నాటి ఇంజిన్‌తో నడిచే భాక్రా-నంగల్ రైలు ప్రపంచంలోనే అత్యంత ప్రసిద్ధమైన రైలుగా పేరొందిదింది. 1953లో అమెరికా నుంచి ఈ రైలు డీజిల్ ఇంజన్లను దిగుమతి చేసుకున్నారు. ఈ రైలు బోగీల ప్రత్యేకత ఏమిటంటే అవి కరాచీలో తయారు చేశారు. అంతేకాకుండా, కుర్చీలు కూడా బ్రిటీష్ కాలం నాటి కలపతో తయారు చేశారు. నేటికీ చెక్కుచెదరకుండా అలాగే ఉన్నాయి.

భారతీయ రైల్వేలు ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే నెట్వర్క్‌లలో ఒకటి. 65,000 కిలోమీటర్ల రూట్‌లను కలిగి 7,500 స్టేషన్లతో ప్రతి రోజు సుమారు 23 మిలియన్ల మంది ప్రయాణీకులు భారతీయ రైల్వేలను ఉపయోగిస్తారు. ఇది ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో ఉద్యోగులను కలిగి ఉన్న సంస్థలలో ఒకటి. భారతీయ రైల్వేలు అనేక విభాగాలుగా విభజించబడ్డాయి, ప్రతి విభాగం ఒక ప్రత్యేక ప్రాంతాన్ని కవర్ చేస్తుంది. ఈ విభాగాలు రైల్వే నిర్వహణను సులభతరం చేస్తాయి, ప్రయాణీకులకు మెరుగైన సేవలను అందిస్తాయి. రైల్వేలు సాంకేతికతలో కూడా ముందంజలో ఉన్నాయి. రిజర్వేషన్ సిస్టమ్ కంప్యూటరీకరణ, ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. భారతీయ రైల్వేలు పర్యాటక రంగంలో కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. డార్జిలింగ్ హిమాలయన్ రైల్వే, నీలగిరి మౌంటెన్ రైల్వే వంటి పర్యాటక రైళు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. ఇవి యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాలుగా గుర్తించబడ్డాయి. మొత్తానికి, భారతీయ రైల్వేలు భారతదేశ అభివృద్ధిలో ఒక కీలక పాత్ర పోషించాయి. ఇవి కేవలం రవాణా సాధనాలు కాకుండా, భారతీయుల జీవితంలో ఒక భాగంగా మారాయి. ఈ చరిత్రను తెలుసుకోవడం ద్వారా మనం భారతదేశ అభివృద్ధి ప్రయాణాన్ని అర్థం చేసుకోవచ్చు.

**- వేణు పెరుమాళ్ల**

ఈ ఏడాది స్టార్లు లేని కమిటీ కుర్రోళ్ళు, ఆయ్, 35 లాంటి సినిమాలు మంచి విజయం సాధించి చిన్న చిత్రాలకు ఉత్సాహాన్నిచ్చాయి. ఈ వరుసలోనే ఇప్పుడు 'రోటీ కపడా రొమాన్స్' చిన్న సినిమా ప్రామిసింగ్ ప్రోమోలతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఈ రోజే థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్ర విశేషాలేంటో చూద్దాం పదండి.

### కథనం-విశ్లేషణ:

'రోటీ కపడా రొమాన్స్' అనే టైటిల్.. 'లెట్స్ సెలబ్రేట్ ద బ్రేకప్స్' అనే ట్యాగ్ లైన్.. 'ఎ' సర్టిఫికేషన్.. ఇవన్నీ చూశాక ఇది ఎలాంటి సినిమానో ప్రేక్షకులకు ఒక అంచనా వచ్చేస్తుంది. ట్రైలర్లో కూడా ఏం చూడబోతున్నామో ముందే క్లియర్ కట్ గా చెప్పేసింది టీం. ఇది పక్కా యూత్ ను టార్గెట్ చేసిన సినిమా. ఈ తరంలో కుర్రాళ్ల ఆలోచనలు ఎలా ఉన్నాయి.. అమ్మాయిలు ఎలా ఆలోచిస్తారు.. వీళ్ల లైఫ్ స్టైల్ ఎలా ఉంటుంది.. వీళ్ల సరదాలేంటి.. ప్రేమ మీద పెళ్లి మీద కెరీర్ మీద వీరి అభిప్రాయాలేంటి.. రిలేషన్షిప్ ను ఎలా చూస్తారు.. బ్రేకప్ ను ఎలా తీసుకుంటారు.. ఈ విషయాలను రియలిస్టిగ్గా చర్చించిన సినిమా ఇది. కొంచెం అడ్వాన్స్డ్ లైఫ్ స్టైల్.. ఆలోచనలు ఉన్న యూత్ కథలు కావడం వల్ల బోల్డుగానే చూపించే ప్రయత్నం జరిగింది. డైలాగులకు.. సన్నివేశాలకు ఫిల్టర్ ఏమీ వాడలేదు. కాబట్టి కొంచెం ట్రెడిషనల్ ఆడియన్స్ ఇబ్బంది పడొచ్చు. ఫ్యామిలీస్ కు ఇది రుచించకపోవచ్చు. కానీ యూత్ కు మాత్రం 'రోటీ కపడా రొమాన్స్' మంచి కిక్కే ఇస్తుంది.

దర్శకుడు విక్రమ్‌రెడ్డి 'రోటీ కపడా రొమాన్స్' కథను బోల్డుగా చెప్పే విషయంలో ఎంత క్లారిటీతో ఉన్నాడో చెప్పడానికి సోనియా అనే పాత్ర ఉదాహరణ. యవ్వనంలో ఉన్న ఆ అమ్మాయి 'అర్జున్ రెడ్డి' సినిమాలో హీరో హీరోయిన్ల రొమాన్స్ చూసి హార్మోన్లు అదుపు తప్పి.. చదువు మీద దృష్టిపెట్టలేని స్థితిలో రిలేషన్‌షిప్ లేకుండా ఎవరైనా అబ్బాయితో శృంగారంలో పాల్గొని ఆ మోహం వదిలించుకోవాలనుకుంటుంది. అందుకోసమే ఓ అబ్బాయిని వెతికి పట్టుకుంటుంది. తనతో రొమాన్స్ చేస్తుంది. ఈ పాత్రను ఆరంభించిన తీరు.. తర్వాత వచ్చే సన్నివేశాలు చూస్తే.. మనం ఏదో బూతు సినిమాలో కూర్చున్నామా అనే ఫీలింగ్ కలుగుతుంది. కానీ ఈ పాత్రను మొత్తంగా తీర్చిదిద్దిన తీరు.. దీనికి ఇచ్చిన పేఆఫ్ చూశాక దర్శకుడి కన్విక్షన్ అర్థమవుతుంది. వల్గర్ క్యారెక్టర్ లాగా కనిపించే ఈ పాత్రను తర్వాత చూసే కోణమే మారిపోతుంది. దాని పట్ల ఒక ఆపేక్ష కలుగుతుంది. ఇలాంటి పాత్రను ఒక మెయిన్ స్ట్రీమ్ మూవీలో పెట్టి ప్రేక్షకులను కన్విన్స్ చేయడం అంత తేలిక కాదు. దర్శకుడు ఈ విషయంలో మంచి మార్కులు కొట్టేస్తాడు.

'రోటీ కపడా రొమాన్స్'లో కథ పరంగా అంత కొత్తగా ఏమీ కనిపించదు. నలుగురు అబ్బాయిలు.. నలుగురు అమ్మాయిలు.. వీరి మధ్య ప్రేమ- రొమాన్స్-బ్రేకప్.. ఈ వ్యవహారమంతా ఎన్నో యూత్ సినిమాల్లో చూసినట్లే ఉంటుంది. సన్నివేశాలు అంత కొత్తగా ఏమీ కనిపించవు. కాకపోతే బోర్ కొట్టని విధంగా నాలుగు కథలను బాగానే నరేట్ చేశాడు దర్శకుడు. పైన చెప్పుకున్న సోనియా పాత్ర టిపికల్ గా ఉండడం వల్ల ఆ స్టోరీ భలే ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. ఆ జంట మధ్య.. అలాగే సూర్య-దివ్య జంట మధ్య రొమాంటిక్ మూమెంట్స్ యూత్ ను ఆకట్టుకుంటాయి. విక్కీ పాత్ర మంచి హ్యూమర్ తో సాగుతుంది. రాహుల్-ప్రియ అనే జంట మధ్య సాఫ్‌వేర్ కంపెనీలో సాగే లవ్ స్టోరీ మాత్రం కొంచెం బోర్ కొట్టిస్తుంది. సినిమా ఆరంభం కూడా కొంచెం డల్లుగా అనిపించినా.. ఆ తర్వాత బాగానే ఊపందుకుంటుం ది. ప్రేమలో ఉన్నపుడు అంతా అద్భుతంగా అనిపించి బ్రేకప్ అన్నపుడు భరించలేని బాధ కలగడం సహజం. లవ్ స్టోరీలు సరదాగా సాగుతున్నపుడు హుషారుగా అనిపించే 'రోటీ కపడా రొమాన్స్'.. జంటల మధ్య సమస్యలు వచ్చి విడిపోయినపుడు డల్ అవుతుంది. నరేషన్ కొంచెం నెమ్మదిగా సాగడం వల్ల కూడా ప్రి క్లైమాక్స్ భారంగా మారుతుంది. ఐతే ముగింపులో మాత్రం 'రోటీ కపడా రొమాన్స్' మెప్పిస్తుంది. రెండు గంటలకు పైగా అబ్బాయిల కోణంలోనే కథను నడిపించి.. అమ్మాయిలను విలన్ల మాదిరి చూపించిన దర్శకుడు.. చివర్లో అమ్మాయిల దృక్కోణాన్ని చూపించి ఈ కథను బ్యాలెన్స్ చేయడానికి ప్రయత్నించాడు. ఎమోషనల్ గా సాగే చివరి పావుగంట ప్రేక్షకులు మంచి ఫీల్ తో బయటికి వచ్చేలా చేస్తుంది. హ్యాపీ డేస్.. హుషారు లాంటి సినిమాలను గుర్తు చేసే 'రోటీ కపడా రొమాన్స్' ఆరంభంలో.. ద్వితీయార్థంలో స్లోగా అనిపించినప్పటికీ మిగతా చోట్ల మెప్పిస్తుంది. బోల్డ్ టచ్ ఉన్న యూత్ ఫుల్ సినిమాలను ఇష్టపడేవారికి ఇది మంచి ఛాయిసే.

**- తుపాకి.కామ్ సౌజన్యంతో...**

**నటీనటులు:**

ఆర్టిస్టులందరూ కొత్త వాళ్లే అయినా బాగా చేశారు. 'కమిటీ కుర్రాళ్లు' ఫేమ్ సందీప్ సరోజ్.. రాహుల్ పాత్రలో రాణించాడు. ఆర్జే సూర్యగా చేసిన కుర్రాడు చూడ్డానికి బాగున్నాడు. పాత్రకు తగ్గట్లుగా నటించాడు. విక్కీ పాత్రలో సుప్రజ్ రంగా కామెడీ బాగా చేశాడు. హర్ష నర్రా కూడా తన పాత్రలో ఆకట్టుకున్నాడు. సోనియా అనే బోల్డ్ క్యారెక్టర్లో ఖుష్బు చౌదరి చాలా బాగా చేసింది. సోను ఠాకూర్ జస్ట్ ఓకే అనిపిస్తుంది. నువేక్ష.. మేఘ లేఖ ఆకట్టుకున్నారు. మిగతా ఆర్టిస్టులంతా ఓకే. ఎవ్వరూ తమ పాత్రల్లో అసహజంగా అనిపించకపోవడం.. నటనలో తడబడకపోవడం విశేషం.

**కథ:** రాహుల్ (సందీప్ సరోజ్).. హర్ష (హర్ష నర్రా).. విక్కీ (సుప్రజ్ రంగా).. సూర్య (తరుణ్ పొంగులేటి).. హైదరాబాద్ సిటీలో ఒక రూంలో కలిసి ఉంటున్న స్నేహితులు. వీరిలో రాహుల్ సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తుంటే.. సూర్య రేడీయో జాకీగా పని చేస్తుంటాడు. మిగతా ఇద్దరు ఖాళీగా ఉంటారు. ఒకరికి ఒకరు సహకరించుకుంటూ.. వీకెండ్స్ చిల్ అవుతూ సంతోషంగా సాగిపోతున్న వీరి జీవితాల్లో ఒక్కొక్కరుగా అమ్మాయిలు వస్తారు. మొదట్లో అమ్మాయిల సాంగత్యంతో ఈ నలుగురూ గాల్లో తేలిపోతారు. కానీ ఆ అమ్మాయిలతో కొంత జర్నీ తర్వాత సమస్యలు మొదలవుతాయి. ఒక్కొక్కరుగా తమ జీవితాల్లోంచి వెళ్లిపోవడంతో వీరి జీవితాలను శూన్యం ఆవహిస్తుంది. మరి ఆ బాధ నుంచి ఈ నలుగురూ ఎలా బయటపడ్డారు.. తమను మోసం చేశారని అనుకున్న అమ్మాయిలతో ఎలా వ్యవహరించారు అన్నది మిగతా కథ.

**సాంకేతిక వర్గం:**

పరిమిత బడ్జెట్లో తెరకెక్కినప్పటికీ 'రోటీ కపడా రొమాన్స్'లో సాంకేతిక విభాగాలు మంచి ఔట్ పుటే ఇచ్చాయి. హర్షవర్ధన్ రామేశ్వర్-ఆర్ఆర్ ధ్రువన్-వసంత్.. ఈ ముగ్గురూ కలిసి అందించిన పాటలు యూత్‌ఫుల్‌గా అనిపిస్తాయి. చార్ట్‌బస్టర్ సాంగ్స్ లేకపోయినా.. సినిమాలో ఆయా సందర్భాలకు తగ్గట్లుగా పాటలు బాగానే సాగాయి. సన్నీ ఎంఆర్ నేపథ్య సంగీతం కూడా హుషారుగా సాగింది. సంతోష్ రెడ్డి విజువల్స్ బాగున్నాయి. నిర్మాణ విలువలు ఓకే. దర్శకుడు విక్రమ్ రెడ్డి మంచి పనితనం చూపించాడు. తాను అనుకున్న కథను నీట్ గా నరేట్ చేశాడు. తన నరేషన్ కొంచెం స్లో అన్నది తప్పితే పెద్దగా కంప్లైంట్స్ కనిపించవు. బోల్డ్ టచ్ ఉన్న కథ.. క్యారెక్టర్లు రాసుకున్నప్పటికీ సినిమాలో సన్నివేశాలేమీ వల్గర్ అనిపించకుండా చూసుకున్నాడు. కొత్త ఆర్టిస్టులే అయినా అందరి నుంచి మంచి నటన రాబట్టుకున్నాడు.




# యూత్‌కి ఎక్కేస్తుంది!



ఏ విహారయాత్రో, తీర్థయాత్రకో వెళ్లితే.. ఎవరైనా, మంచి సౌకర్యాలున్న గదులెక్కడున్నాయో చూసుకుంటారు. అలాంటి అతిథి గృహాలో, లాడ్జింగ్సో, రిసార్ట్సో ఎంచుకుంటారు. వెళ్లినచోట ఎంత అలసిసొలసి తిరిగొచ్చినా.. కాసింత సుఖం, సంతోషం, ఒక ప్రశాంత వాతావరణం కోసం ఆ సదుపాయం, ఆ ఏర్పాటు. కానీ, ఎక్కడికైనా వెళ్లినప్పుడు.. జన్మవిముక్తిని కోరుకునే అతిథి గృహాన్నెంచుకుంటారా..? అసలలాంటి అతిథి గృహాలుంటాయా..? పునర్జన్మ ఉందొద్దని కోరుకుంటూ మోక్షం కోసమంటూ విముక్తి కోరుతూ ఎంచుకునే అతిథిగృహాలకూ.. కాశీ ఓ మజిలీ!

# విముక్తి భవన్..ముముక్షుభవన్..

# కాశీలోని ఈ భవనాల కథ తెలుసా?

### ఏంటా కాశీమజిలీ కథ..?

ఉమ్మడి కుటుంబాలు విడిపోతున్నాయి. ఆదర్శ కుటుంబాల పేరిట తల్లిదండ్రులు, ఎక్కువలో ఎక్కువ ఇద్దరు పిల్లలతోనే కుటుంబాలు కనిపిస్తున్న వేళ.. ఆర్థిక తారతమ్యాలు, కుటుంబ గొడవలతో.. ధనం మూలం ఇదం జగత్‌గా మారిపోయింది. పెరుగుతున్న సాంకేతిక విజ్ఞానం మనిషిని మనిషి తనకు తాను అంతర్లీనంగా తెలుసుకునే వికాసం కన్నా విధ్వంసం వైపే అడుగులు వేయిస్తోంది. మరోవైపు ఎదిగిన కొడుకులు తల్లిదండ్రులను పట్టించుకోక వివిధ కారణాలను సాకులుగా చూపుతుండటంతో వృద్ధాశ్రమాలకూ గిరాకీ పెరిగిపోయింది.

ఇలాంటి పరిస్థితుల్లో ఎవరికెవరు ఈలోకంలో అని ఓ సినీ కవి చెప్పిన వైరాగ్యభావన పరాకాష్ఠకు చేరినవారు.. ఇక తామెక్కువ రోజులు బతుకలేమనే ఒక నమ్మకానికొచ్చినవారు.. ఇదిగో కాశీలోని అస్సీ ఘాట్ మార్గం వైపు దారి కడుతున్నారు. పునర్జన్మ లేని విముక్తి కోసం.. కాశీ లాభ్ విముక్తి భవన్‌కు కాస్త, అంతకుముందు ముముక్షు భవన్‌కు బాటసారులై తరలివెళ్లుతున్నారు.

**ఇంతకీ ఏంటీ.. ఈ కాశీ లాభ్ విముక్తి భవనం, ముముక్షు భవనాల వైరాగ్య కథ..?**

ఇక మేం తనువు చాలిస్తాం. ఈ లోకంలో మాకు మేం తప్ప ఇంకెవ్వరూ లేరు. అందులోనూ కాశీలో మరణిస్తే ముక్తి లభిస్తుంది. కాశీలో మరణ విముక్తితో మరుజన్మకు తావులేదనుకునేవాళ్లు క్యూ కట్టే ప్రదేశమే ఈ ముముక్షు భవన్.

ఇక ఈ శరీరాన్నే విడిచి వెళ్తామనుకునేవారికి ఇంకా కులాలేంటి, మతాలేంటన్న సందేశం అంతర్లీనమె వాటికతీతంగా ఎవరు వచ్చినా మరణానికి ముందు ఆదరించే శరణాలయమే మోక్షభవనంగా పిల్చుకునే ముముక్షు భవన్. అయితే, ఇక ఎవరి జీవితమైనా చివరి దశకు చేరుకుంటుంది..తనువు చాలించడమే తరువాయి అన్న సూచనలు కనిపిస్తే.. ముముక్షు భవన్ నుంచి కేవలం పది, పదిహేను రోజుల్లో దేహాన్ని విడిచి వెళ్తారనుకునేవారిని కాశీ లాభ్ ముక్తి భవన్ కు తరలిస్తారు.

1920లో కాశీలోని అస్సీ ఘాట్ వద్ద స్థాపించిన ఈ ముముక్షుభవన్‌ను.. కాశీ ముముక్షు సభకు సంబంధించిన సభ్యులంతా కలిసి ప్రారంభించారు. ఈ ముముక్షు భవన్ ప్రాంగణంలోనే సంస్కృత కళాశాల, గురుకుల విద్యాలయం, గ్రంథాలయం వంటివున్నాయి. అలాగే, ఇక్కడికొచ్చేవారికి ఉచిత భోజనం, ఆయుర్వేద వైద్యమందించే ఏర్పాట్లూ చేసి పెట్టారు.

ఇక్కడ కనిపించేవారంతా రెక్కలు వచ్చిన పక్షుల నిరాదరణకు గురైన వృద్ధ తల్లిదండ్రుల జంటలే ఎక్కువ. ఇంటిపట్టున ఏ భావోద్వేగాలను, ప్రేమ, ఆప్యాయతనైతే కోల్పోయారో.. అవేవీ మిస్ కాకుండా తమ చివరి మజిలీలో చూసుకోవడమే ఈ మోక్షభవన్ ప్రత్యేకత.

ప్రపంచంలో ఎవరైనా చనిపోతే సంతాపాలు, శ్రద్ధాంజలి ఘటించడం చూస్తాం. కానీ, అదే కాశీలో పోతే మాత్రం దాన్ని ఆశీర్వాదంగా భావించే వాళ్లే కొల్లలు. ఇది విశ్వాసాలతో కూడిన జీవన విధానం. అలాంటి పుణ్యభూమిగా చాలామంది వారణాసిని నమ్మబట్టే.. విశ్వనాథుడు కొలువైన చోట.. ఏకంగా ఆ నిటలేశ్వరుడు గజ్జె కట్టి ఆడే మణికర్ణిక శ్మశానానికి దరిదాపుల్లో ఈ ముముక్ష, ముక్త్ భవనాలను నిర్మించారు.

ముముక్ష భవన్ కు వచ్చేవారి నుంచి మినిమం ఫీజ్ తీసుకుంటారు. అయితే, ఎందరో క్యూ కట్టినా కాస్త వాళ్ల స్థితిగతులు, అంతకుముందు వారి జీవిన పరిస్థితులు ఇవన్నీ పరిశీలించి అర్హులను కున్నవారినీ, అవసరార్థులను మాత్రమే చేర్చుకుంటారు. ఎవరైనా ఆర్థికంగా లేనివారు వచ్చినా వారి పరిస్థితి బట్టి చేర్చుకునే ఉదారతా ఈ మోక్షభవన్‌లో లభిస్తుంది.

ఇక్కడ వారి అన్నపానీయాలకు కావల్సిన ఏర్పాట్లతో పాటు.. కాలకృత్యాలకు, స్నానాదులకు కావల్సిన ఏర్పాట్లుంటాయి.

బంగ్లాదేశ్‌కు చెందిన కమలా చక్రవర్తి గతంలో ఏమన్నారంటే.. ముముక్షభవన్‌లో నన్ను ఇక్కడ వారు చాలా బాగా చూసుకుంటున్నారు. ఈ లోకాన్ని విడిచిపెట్టేలా.. పునర్జన్మ లేకుండా నాకు విముక్తి ప్రసాదించారని ఆ విశ్వనాథుణ్ని కోరుకుంటానన్నారు.

ఇలా బంగ్లాదేశీ అయిన 97 ఏళ్ల వితంతువు కమలా చక్రవర్తిలాగే.. ఇక్కడ కుల, మత, జాతి, ప్రాంత, దేశాలకతీతంగా భిన్నరకాల సమ్మేళంతో ఈ విముక్తి భవనాలు కనిపిస్తాయి. ముముక్షు భవన్‌లో 60 ఏళ్లకు పైబడ్డవాళ్లు కనిపిస్తే.. ఇక రేపో, మాపో పోతామనుకునేవారు.. 80 ఏళ్లకు పైబడ్డవారు ముక్త్‌భవన్‌లో దర్శనమిస్తారు.

కాశీ అంటేనే కథల సంపుటి. ఒకవైపు అద్వైతసిద్ధి కోసం జరిగే ప్రయత్నాలు.. ఇంకోవైపు బతుకు పోరాటపు దృశ్యాలు భిన్నమైన కోణాలను మన కళ్లకు కడుతూనే ఉంటాయి. అప్పుడే గంగలో స్నానాదికాలు ముగించుకుని సంధ్యావందనాలు చేసుకుని మడి, ఆచారాలతో మంత్రాలు చదువుతూ ఘాట్ మెట్లెక్కి వచ్చే బ్రాహ్మణులొకవైపు కనిపిస్తుంటే.. వారి పక్కనుంచే ఒకటి తర్వాత మరొకటి మణికర్ణిక ఘాట్‌కు ఈ లోకాన్ని విడిచిపోయే శవాలు దహనసంస్కారం కోసం బయల్దేరుతాయి.

అనాథలైనవారెందరో శ్మశాన వాటికల్లో ఆడ, మగ లింగభేదం లేకుండా కనిపించే కాటికాపర్లు.. వారితో వ్యాపారాన్ని నడిపించే దళారీలు.. ఇలా మొత్తంగా మోక్షానికి నెలవని నమ్మే చోటా అబ్బురపర్చేలా మోసాలూ అణువణువునా తారసపడే ఓ భిన్న ప్రదేశం కాశీ.

**మోక్షభవన్ నుంచి ముక్తిభవనంలోకి ఎంట్రీని ఎలా నిర్ణయించేది..?**

ఇక పదిహేను రోజుల్లోపు చనిపోతారనుకునేవారే ముక్త్ భవన్ లోకి తీసుకెళ్లబడతారు. అందుకోసం మాత్రమే ఈ ధర్మశాల సంరక్షణ అని ఇక్కడివారు చెప్పే మాట. 1920లో మోక్షభవనం ప్రారంభమైతే.. 1958లో శ్రీ విష్ణు హరి దాల్మియా మరణ విముక్తి కోసం కాశీకి వచ్చేవారి కోసం ఈ లాభ్ ముక్త్ భవన్ ఏర్పాటు చేశారు.

ఏడాదికి సుమారు 250 మందికి పైగా ఈ లాభ్ ముక్త్ భవన్ బాట పడతారు. ఎందుకంటే, ఇది కేవలం ముక్తి పొందే మణికర్ణిక ఘాట్ కు అరకిలోమీటర్ దూరంలో మాత్రమే ఉంటుంది.

అయితే, వేలల్లో, వందల్లో ఒక్కరికి మాత్రమే ఆ ముక్తి లభించే అవకాశముందంటారు ఇక్కడ పనిచేసే మేనేజర్స్. వేల మంది ఈ ముక్త్ భవన్ నుంచి మణికర్ణిక ఘాట్ కు వెళ్లే క్రమంలో వారి ఆత్మకు శాంతి కల్గాలని తాము చేయాల్సిన క్రియలన్నీ శాస్త్రయుక్తంగా చేస్తామంటారు ఇక్కడి ముక్త్ భవన్ సిబ్బంది.

గతంలో ఇక్కడ పనిచేసిన మేనేజర్ శుక్లా ఏమంటారంటే తన అనుభవంలో సుమారు 15 వేల మంది ఈ ముక్త్ భవన్ లో విముక్తి పొందారని.. అయితే, వారు భవబంధాలను త్యజించినవారైనప్పుడే వారు పునర్జన్మ నుంచీ విముక్తి పొందే అవకాశముందని.. అలాంటివారు అరుదేనన్నది శుక్లా మాట.

ఆయన చెప్పిన కొన్ని ఉదాహరణల్లో ఓ కథ మానవ జీవితంలో కోల్పోతున్న దాన్ని పట్టి చూపేది. రామ్ సాగర్ మిశ్రా అనే సంస్కృత పండితుడుండేవాడు. సోదరులలో పెద్దవాడైన మిశ్రాకు, అత్యంత సాన్నిహిత్యమున్న తన తమ్ముడితో కుటుంబ కలహాలు చెలరేగాయి. దాంతో ఎప్పుడూ కలిసుండే వారిద్దరి కుటుంబాలూ వేరుపడ్డాయి.

తన చివరి రోజుల్లో మిశ్రా కూడా కాశీలోని ముక్తి భవన్ కు మరో పదిహేను రోజుల్లో చనిపోతానన్న ఒక కచ్చితత్వంతో వచ్చారు. ఇక రేపో, మాపో తను దేహాన్ని విడుస్తున్నాననుకుంటున్న తరుణంలో 40 ఏళ్ల నుంచి కుటుంబ కలహాలతో తన సోదరుడిని కలవలేకపోయిన మిశ్రాలో ఏదో అపరాధ భావన వెంటాడింది.

తన చివరి కోరికగా.. ముక్తి భవన్ పెద్దలకు తన తమ్ముడికి తన ఆరోగ్య పరిస్థితి గురించి తెలియజేమని విజ్ఞప్తి చేశాడు. వెళ్లేముందు అన్ని వివాదాలను పరిష్కరించుకు వెళ్లాలనేదే మిశ్రా అంతర్గత మనస్సు చెప్పే మాట. మిశ్రా కోరిక మేరకు తమ్ముడికి ముక్తిభవన్ నుంచి లేఖ వెళ్లింది.

అన్న ఆ పరిస్థితిలో ఉన్నాడని తెలిసిన తోడబుట్టిన తమ్ముడూ హుటాహుటీన కాశీ బాట పట్టాడు. ఇద్దరూ ఒకరినొకరు చూసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. అప్పుడు మిశ్రా ఇంట్లో పెట్టిన విభజన గోడను కూల్చేయాలని.. అలాగే, మనసుల్లో ఉన్న విభనలనూ తొలగించాలని ఆ తమ్ముణ్ని కోరాడు.

ఆ మాట విన్న తమ్ముడు సరే అన్నాడు. అన్నదమ్ములిద్దరూ కలవటం వల్ల వచ్చే ఆనందభాష్పాలొకవైపు.. అన్న దూరమై పోతున్నాడన్న బాధ తమ్ముడిలో ఇంకోవైపు ఇదిగో అలాంటి ఎన్నో దృశ్యాలను తాను కాశీ ముక్తి భవన్ లో చూశానంటారు నాటి మేనేజర్ శుక్లా.

లాభ్ ముక్త్ భవన్ స్కాంధ పురాణంలో చెప్పినట్టుగా కాశ్యం మరణం ముక్తి: అనే సామెత ప్రకారం జననం లేని మరణం కోసమే ఎదురుచూస్తుంటుందట.

అయితే, ఉపనిషత్తులు మాత్రం జ్ఞానం లేనిదే ముక్తి సాధ్యం కాదంటాయి. అలా అని విజ్ఞానవంతులు నల్గురు కలిసి కాశీలో ఓచోట పోగై సమావేశమైనంత మాత్రాన ఆ జ్ఞానం వస్తుందనీ కాదు. ముందు ఆ కాశీ విశ్వేశ్వరుణ్ని నమ్మాలంటారు ఇక్కడి పండితులు. మంణంతో మణికర్ణిక ఘాట్ లోకి ప్రవేశించి అంత్యక్రియలనంతరం ఆ పరమేశ్వరుడు వారిని దరికి తీసుకుని చెవిలో చెప్పే తారక మంత్రాన్ని విశ్వసించాలంటారు.

ఆ తారకమంత్రమే.. " రంగ రామాయ నమః". అంటే మన అంత్యక్రియల సమయంలో మనం కాలి బూడిదైపోతున్నప్పుడు ఆ అగ్నిలో ఉన్న సాక్షాత్తూ శ్రీరామచంద్రుడికి మన అంతర్మాతలో కొలువైన ఆ తారకరాముడికి నమస్కరించడం వల్ల మాత్రమే భవబంధాలను త్యజించి ఆ తారకమంత్ర జపం చేయడం వల్ల మాత్రమే.. విముక్తి లేని మరణం సాధ్యమంటూ ఇక్కడి పండితులు చెప్పే మాట!

వరుణ, అసి నదుల సంగమాన జరిగే తంతు, నమ్మకాలు, విశ్వాసాలపై ఎవరి అభిప్రాయాలు వారివైనప్పటికీ.. ఆ విశ్వనాథుడు కొలువై, నిత్యకాష్ఠానికి నెలవైన ఈ మహాశ్మశానాన.. మరోవైపు సాయం సంధ్య వేళ గంగాహారతితో చూడముచ్చటైన దృశ్యానికి వేదికగా.. ఆసక్తకర అంశాలెన్నింటికో కాశీ ఓ భిన్నమైన క్షేత్రం! జీవితంలో ఒక్కసారైనా నాస్తికులు, ఆస్తికులు, హేతువాదులు, భిన్నజాతులు ఓపెన్ మైండ్ సెట్‌తో ఓసారి సందర్శించాల్సిన చర్చనీయాంశ ధామం కాశీ!

**- రచన : రమణ కొంటికర్ల**




మండలంలోని తోటాడ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే కూన రవికుమార్ శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

**- సత్యంన్యూస్, ఆమదాలవలస**



స్థానిక మండలవీధికి చెందిన లీలారాణి కుటుంబం ఇబ్బందుల్లో ఉందన్న విషయం తెలుసుకున్న శ్రీకాకుళం మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఉర్లం శివతేజ ద్వారా విషయం తెలుసుకున్న ఎమెర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది ఉమాశంకర్ ఇచ్చిన సమాచారంతో బొట్టా సాయికుమార్ తమ్ముడు, బొట్టా దామోదర్ నిత్యావసర సరుకులు మండల వీధికి చెందిన ప్రసాద్ గురుస్వామి ద్వారా అందజేశారు. కార్యక్రమంలో నరేంద్ర, మోహన్, గోవింద్, అచ్యుత్, సురేష్, నరేష్, రవి, పొడుగు చరణ్‌లు పాల్గొన్నారు. **- సత్యంన్యూస్, శ్రీకాకుళం.**

# ప్రతి ఇంట పింఛన్ల పండుగ



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

కూటమి ప్రభుత్వ పాలనలో ప్రతీ ఇంట పింఛన్ల పండగ నెలకొంటుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ మండలం కిష్టప్ప పేట గ్రామంలో, గార మండలం వత్సవలస పంచాయతీ మొగదల పాడు గ్రామంలో శనివారం నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డిసెంబరు 1 ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఫించన్లు ఎప్పుడు వస్తుందో తెలియక వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు అనేక ఇబ్బందులు పడేవారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే ఏప్రిల్ నెల నుంచి పెంచిన పింఛన్‌లు అందజేసి అవ్వతాతల ముఖాల్లో ఆనందం నింపిందన్నారు. ఇచ్చిన మాటలకు కట్టుబడి హామీలు చేసిన గొప్ప ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు చరిత్రలో నిలిచిపోతారన్నారు. వైసీపీ పాలనలో స్కీంల పేరుతో స్కాంలు చేస్తూ ఐదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా సాగుతోందన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. అన్ని రంగాల ప్రజలకు సకాలంలో సంక్షేమంతో పాటు కనీస మౌలిక సదుపాయాల కల్పనకు అభివృద్ధి పనులు చేపడుతున్నారని వివరించారు. వీటితోపాటు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నామని చెప్పారు. గత ఐదేళ్ల నిర్లక్ష్య పాలన ఫలితంగా ప్రజల నుంచి అత్యధికంగా వినతులు వస్తున్నాయన్నారు. త్వరలోనే ప్రాధాన్యత క్రమం ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, పింఛన్‌దారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు అన్ని విధాలా అండగా ఉంటాం

**(సత్యంన్యూస్, అమరావతి)**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటుచేసిన జర్నలిస్టుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం తగ్గించిన అక్రిడేషన్లను గణనీయ స్థాయిలో పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అక్రిడేషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే చంద్రబాబు ఆదేశాల మేరకు జర్నలిస్టుల ఇళ్లస్థలాల కార్యాచరణ ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థలంతోపాటు సబ్సిడీ కలిగిన స్కీంతో ఇళ్ళు నిర్మించాలనే యోచనతో ప్రభుత్వం ఉందన్నారు. మీడియా అక్రిడేషన్ల కమిటీలలో జర్నలిస్ట్ సంఘాలకు ప్రాతినిధ్యం కల్పిస్తున్నామన్నారు. జర్నలిస్టు సంఘాలు ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా జర్నలిస్టులపై దాడుల నివారణకు నివారణ కమిటీలు, జర్నలిస్టుల అవార్డుల పునరుద్ధరణ చేపడతామని తెలిపారు. హెల్త్‌కార్డుల కింద ట్రీట్‌మెంట్ కోసం మొత్తాన్ని రూ.5 లక్షల నుండి 10 లక్షలకు పెట్టడానికి ప్రయత్నిస్తామన్నారు. ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పిస్తామని పేర్కొన్నారు. కోవిడ్ మృతి చెందిన జర్నలిస్టులకు 5లక్షలు పరిహార జీవో అమలుపై పరిశీలిస్తామని తెలిపారు. సోషల్ మీడియాలో పోస్టులు చాలా అభ్యంతరకరంగా ఉన్నాయని వాటి నివారణకు మీడియా కృషి చేయాలని సూచించారు.

**ప్రెస్ అక్రిడేషన్ల కొత్త నిబంధనల ముసాయిదాపై డైరెక్టర్ హిమాన్షు శుక్లా పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

కొత్తగా రాబోతున్న ప్రెస్ అక్రిడేషన్ల జీవో ముసాయిదాపై సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అక్రిడేషన్ల జారీలో లిబరల్‌గా ఉంటామని పేర్కొన్నారు. ఐదు జర్నలిస్టు సంఘాలతో పాటు ఎలక్ట్రానిక్ మీడియా, ఫోటోగ్రాఫర్స్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ల నుండి ఒక్కొక్కరికి కమిటీల్లో స్థానం ఇస్తామన్నారు. పాత ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన అక్రిడేషన్లు జారీ చేస్తామన్నారు. ఎంప్యానల్‌మెంట్ లేని పత్రికల కంటే ఎంప్యానల్డ్ స్మాల్ దినపత్రికలకు అదనంగా అక్రిడేషన్లు



పెంచుతున్నామని తెలిపారు. ఈ ఫైలింగ్ సిఏ సర్టిఫికెట్‌తోనే కలిగి ఉంటుంది కాబట్టి దాన్ని ప్రధానంగా తీసుకుంటామన్నారు. దీనిపై జర్నలిస్టు సంఘాలు ప్రతినిధులు పలు సూచనలు చేశారు. స్మాల్ పేపర్ల కేటగిరి కింద పత్రికలు విస్తృతంగా ఉన్నాయి. కాబట్టి రెండు అసోసియేషన్‌లకు ప్రాతినిధ్యం కల్పించాలని ప్రధానంగా స్పెషల్ కేటగిరీ క్రింద ప్రత్యేకంగా ప్రాతినిధ్య భరిస్తున్న వహిస్తున్న అసోసియేషన్‌కు ఆ అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఎంప్యానల్డ్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరగా దానికి మంత్రి అంగీకరించారు. ఐదు జర్నలిస్టు సంఘాలకు బదులు 7కి పెంచాలని, ఎడిటర్స్ అసోసియేషన్‌తో కూడా అవకాశం కల్పించాలని పలువురు కోరగా దానిపై మంత్రి అనుకూలంగా స్పందించారు. వీటితోపాటు ఎంప్యానల్డ్ న్యూస్‌పేపర్ల రేటుకార్డును అమలు చేయాలని, అన్ని రకాల స్మాల్ పత్రికలకు యాడ్స్ విడుదల చేయాలని, లోకల్ ఎలక్ట్రానిక్ ఛానల్‌లో ప్రధాన కేంద్రం నుండి టెలికాస్ట్ చేసే వాటికి, కేబుల్ రన్నింగ్‌తో సంబంధం లేకుండా అక్రిడేషన్లు జారీ చేయాలని,ఎంప్యానల్‌మెంట్‌తో సంబంధం లేకుండా స్మాల్ దినపత్రికలకు అక్రిడేషన్లు పెంచాలని, పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో పలు జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి, డైరెక్టర్ హిమాన్షు శుక్లా, జె.డీ పి. కిరణ్ కుమార్ లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ, కోశాధికారి వి.శ్రీరామ్ యాదవ్, ఉపాధ్యక్షులు వల్లూరు ప్రసాద్ కుమార్, ఎన్.కోటేశ్వరరావు, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, కార్యనిర్వహక కార్యదర్శి మారుతి చౌదరి,చెవుల రంగారావు తదితరులు పాల్గొన్నారు.


ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాల్మ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE WOMEN'S COLLEGE ROAD, SRIKAKULAM - 532 001

# ముగ్గురు అరెస్ట్.. 31 తులాలు స్వాధీనం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తాళాలు వేసి ఉన్న ఇళ్లు, మహిళలను టార్గెట్ చేస్తూ నేరాలకు పాల్పడిన ముగ్గుర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి సుమారు రూ.33 లక్షలు విలువ చేసే 31 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. అదపాకకు చెందిన పిన్నింటి సంతోష్ గట్టిమ ఆనంద్, తాళాడ గ్రామానికి చెందిన రాగోలు రాంబాబులను అరెస్టు చేయగా, ఇంకా ముగ్గుర్ని అరెస్ట్ చేయాల్సి ఉందని ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.

సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్లో నమోదు కాబడిన కేసు ప్రకారం బంగారు, వెండి ఆభరణాలు దొంగతనం కేసులో పట్టుబడిన నిందితులను విచారించగా, వారి నుంచి 15 కేసుల్లో సుమారు రూ.33.03 లక్షలు విలువ గల 367 గ్రాముల (31 తులాలు) బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.


సరుబుజ్జిలిలో ఒక దొంగతనం, ఆమదాలవలస పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు దొంగతనాలు, పొందూరు పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు దొంగతనాలు, బూర్జ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు దొంగతనాలు, జలుమూరు పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు దొంగతనాలు, నరసన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు దొంగతనాలు, ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక దొంగతనం, శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక దొంగతనం, టెక్కలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక దొంగతనం చేసినట్టు వివరించారు.

సరుబుజ్జిలి ఎస్ఐకి వచ్చిన సమాచారం మేరకు వారి సిబ్బందితో సరుబుజ్జిలి జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సరుబుజ్జిలి బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న పిన్నింటి సంతోష్, రాగోలు రాంబాబుని పట్టుకుని విచారించారు. శ్రీకాకుళం జిల్లాలో సుమారు 15 దొంగతనాలు చేసినట్లు, గతంలో కూడా పలు నేరాలకు పాల్పడినట్లు తెలిపారు. దొంగిలించిన సొత్తును ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడిలో ఎవరికైనా అమ్ముదామని వెలుతుండగా పట్టుబడినట్లు వివరించారు.

రాత్రి సమయాల్లో కారును అద్దెకు తీసుకొని దానిలో దొంగతనం చేయడం, ఊరికి కిలోమీటరు దూరంలో వాహనం నిలిపి, అక్కడి నుంచి నడుచుకుని వెళ్లి, నిద్రిస్తున్న మహిళల మెడలో బంగారు ఆభరణాలు తెంపుకు పారిపోవడం, ఇళ్ల తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించి బంగారం, వెండి వస్తువులు, డబ్బులను దొంగిలించడం వీరి ప్రధాన నేర ప్రవృత్తి. గతంలో పిన్నింటి సంతోష్ వేరే వ్యక్తులతో కలిసి చేసిన 20 నేరాలు చేసినట్లు ఒప్పుకున్నాడు.

శ్రీకాకుళం పట్టణ డీఎస్పీ సిహెచ్ వివేకానంద ఆధ్వర్యంలో చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన వి.సూర్యచంద్రమౌళి, కె.పైడపునాయుడు, జె.శ్రీనివాసరావు, పి.సత్యనారాయణ, ఎస్.బాలరాజు, సిహెచ్.దుర్గాప్రసాద్, కె.కృష్ణప్రసాద్, కె.మధుసూదనరావు, సిబ్బంది శ్యామ సుందరరావు, రాజు, భాస్కరరావు, శ్రీను, సురేష్, విజయ కుమార్, హరీష్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.





# 80 కి.మీ. ... 4 సెకెన్లు.. 4 ప్రాణాలు

## హైడ్రోప్లానింగ్‌తో ప్రమాదం

## సీటుబెల్టులు ధరించకపోవడంవల్లే ప్రాణనష్టం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విజయనగరం జిల్లా పోలిపల్లి వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదం నాలుగు సెకెన్ల వ్యవధిలోనే నాలుగు ప్రాణాలను బలి తీసుకుంది. సిక్కోలుకు చెందిన నలుగురు ప్రయాణిస్తున్న ఫాచ్యూనర్ కారు టైరు పంక్చర్ అవడం వల్ల అదుపుతప్పి ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించినా, వర్షపునీరు డివైడర్‌కు ఆనుకొని నిల్వ ఉండటం వల్ల వేగంగా వెళ్తున్న కారు స్కిడ్ అయి అవతలవైపు ఉన్న రోడ్డులోకి బోల్తా కొట్టినట్టు అర్థమవుతుంది. ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడం వల్ల కూడా టైరు బరస్ట్ అయివుంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ యాక్సిడెంట్ వెనుక కారణాలను పరిశీలిస్తే మనకు ఎన్నో గుణపాఠాలు నేర్పుతుంది. ఇందులో ప్రయాణిస్తున్న వారెవరూ సీటుబెల్టు ధరించలేదని మృతదేహాలు చెల్లాచెదురుగా పడివున్న దృశ్యాన్ని చూస్తే అర్థమవుతుంది. ప్రమాదం జరిగిన వెంటనే మరణించడానికి కారణం తలకు బలమైన గాయాలు కావడమే. వెనుక సీటులో కూర్చున్న మణిమాల శరీరమైతే పూర్తిగా మడతపడిపోయింది. కేవలం నాలుగు సెకెన్ల వ్యవధిలోనే కారు డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న లారీ కిందకు వెళ్లిపోయింది. వర్షం పెద్దగా లేకపోయినా రోడ్డు మీద నీరు ఎటూ పోడానికి వీల్లేకపోవడం వల్ల డివైడర్ వరకు నిల్వ ఉంటుంది. దీని మీద కారు ప్రయాణించినప్పుడు హైడ్రోప్లానింగ్ అనే ప్రక్రియ జరుగుతుంది. నెమ్మదిగా వెళ్తే కారు స్కిడ్ అవుతున్నట్టు అర్థమవుతుంది. అదే వేగంగా వెళ్తే గతితప్పుతుంది. సాధారణంగా వర్షపు నీరు నిల్వ ఉన్నచోట చిన్నచిన్న కార్లయితే స్కిడ్ అవుతాయని, ఫార్చ్యూనర్ లాంటి పెద్ద కార్లు ఎంత వేగం కొట్టినా ఏమీ కాదని భావిస్తుంటారు. కానీ ఇక్కడ ఆ నమ్మకమే నాలుగు ప్రాణాలను తీసింది. శనివారం ఉదయం 8గంటల 11 నిమిషాల 44 సెకెన్లకు ఫాచ్యూనర్ కారు లారీని ఢీకొట్టినట్లు రెండు సీసీ కెమెరాలను పరిశీలిస్తే అర్థమవుతుంది. శ్రీకాకుళం నుంచి పోలిపల్లి 80 కిలోమీటర్లు ఉంటుంది. ఈ లెక్కన శ్రీకాకుళంలో ఎన్నిగంటలకు బయల్దేరారో తేలాల్సి ఉంది.



డిసెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాల మేరకు శనివారం పింఛన్ల పంపిణీ జరిగింది. 21వ డివిజన్ బాకర్ సాహెబ్‌పేటలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఉదయాన్నే 5 గంటల నుంచే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు మండల మన్మథరావు, లొట్టి సూరిబాబు, గొర్లి రాందేవ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం




## గురజాడ సంస్కరణ వాదంపై

# ఆకాశవాణిలో లలితారెడ్డి ఇంటర్వ్యూ



(సత్యంన్యూస్, జి.సిగడాం)

మహాకవి,నవయుగ వైతాళికుడు 'గురజాడ అప్పారావు ముత్యాల సరాలులో సంస్కరణ వాదం' అనే అంశంపై జి.సిగడాం కె.జి.బి.వి తెలుగు ఉపాధ్యాయిని, ప్రముఖ పుస్తక రచయిత్రి లలితారెడ్డి ఇంటర్వ్యూను ఆకాశవాణి (ప్రసారభారతి) ఆదిలాబాద్ కేంద్రం శనివారం ప్రసారం చేసింది. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ రేడియో కేంద్రం అనౌన్సర్ (ఆర్.జె) జి.జ్యోతి ఆధ్వర్యం వహించి తమ సుమధుర స్వరంతో ఇంటర్వ్యూ జరిపి సహకారాన్ని అందించారు. గురజాడ 109వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటైంది. 'పూర్ణమ్మ' గేయంలో కాసుకులోనై తల్లీదండ్రి.. నెనరూ న్యాయం విడనాడి.. అంటూ పాడి వినిపించారు. ఈ మహోన్నత గేయాలను ముత్యాలసరాలు అనే నూతన ఛందస్సులో రాసి, సమాజంలో గూడు కట్టుకుని ఉన్న దూరాచారాలను రూపుమాపాలని ఆయన ఎలుగెత్తి చాటారని లలితా రెడ్డి తన ఇంటర్వ్యూలో వివరించారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల నిర్మూలనకు అవగాహన అవసరమని 2వ పట్టణ ఎస్ఐ రామారావు అన్నారు. శనివారం కాకినాడ శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నివారణకు సంకల్పం, అవగాహన సదస్సు నిర్వహించారు. టూటౌన్ ఎస్.ఐ రామారావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణు గోపాల్, వైస్ ప్రిన్సిపాల్ జి.జి.వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రస్తుతం యువత మాదకద్రవ్యాల బారిన పడరాదని, తెలిసీ తెలియని వయసులో మాదకద్రవ్యాలకు యువత అలవాటుపడటం ద్వారా విపరీతమైన సమస్యలు ఎదుర్కొంటారన్నారు. యువత మాదకద్రవ్యాలు, సైబర్ క్రైమ్ ఎక్కువగా సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఆయా పరిస్థితులకు వాళ్లు అలవాటు పడిచాలా సమస్యలు కొనితెచ్చుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా అమ్మాయిలు తెలియని వ్యక్తుల దగ్గర జాగ్రత్తగా ఉండాలని, తెలియని ప్రదేశాలకు ఒంటరిగా వెళ్లే ముందు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ బి.యస్.చక్రవర్తి, టూటౌన్ స్టేషన్ బృందం, ఎన్.ఎస్.ఎస్ పీవో ఎం.నాగభూషణరావు, కళాశాల అధ్యాపక బృందం, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం జిల్లా పరిషత్ ఉపకార్యనిర్వాహణాధికారి కొత్తూరు మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయ నిర్వహణపై పలు సూచనలు చేసి, పల్లె పండుగ పనుల్లో (ఎంఎన్ఆర్ఈజీఎస్) నిధులతో పారాపురం గ్రామంలో నిర్మించిన బీసీ స్మశానవాటిక సీసీ రహదారిని పరిశీలించారు. వీరితో పాటు ఎంపీడీవో నీరజ, ఏవో బంగారం రాంబాబు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, కొత్తూరు

# జోరువానలోనూ జనం కోసం..

## వత్సవలసలో విస్తృతంగా పర్యటన

## ప్రజలతో మేమేకమైన ఎమ్మెల్యే శంకర్



(సత్యంన్యూస్, గార)

జోరువానను సైతం లెక్కచేయకుండా జనం కోసం, సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో మమేకమవుతున్నారు ఎమ్మెల్యే గొండు శంకర్. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ.. వాటికి పరిష్కారాలను, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. వత్సవలస గ్రామంలో పింఛన్ల పంపిణీకి శనివారం వచ్చిన ఆయన కార్యక్రమం అనంతరం గ్రామం మొత్తం తిరిగి ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రామంలో నెలకొన్న దయనీయ పరిస్థితులపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని మహాత్మా గాంధీ చెబితే, ఆ పల్లెలను అధ్వాన్నంగా మార్చిన ఘనత జగన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలైన రోడ్లు, డ్రైన్లు వంటివి నిర్మించకపోవడంతో వర్షం కురిస్తే గ్రామాల్లో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొందన్నారు. గత ఐదేళ్లుగా రహదారుల ఊసే ఎత్తకపోవడంతో రోడ్లన్నీ గోతులమయంగా తయారై ప్రజల పాలిట నరకప్రాయంగా మారిందన్నారు. ప్రజలపై వైకాపా ప్రభుత్వాన్ని ఎందుకంత కక్ష అనేది తనకు అంతుపట్టం లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలల్లోనే ప్రజారంజక పాలన అందించారని పేర్కొన్నారు. ప్రాధాన్యతా క్రమంలో కనీస మౌలిక సదుపాయాల కల్పనను చేపడతామని ప్రజలకు హామీనిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# దళారీల దగా..!

- క్వింటాకు వెయ్యి నష్టానికి అమ్మకం
- ఏడాదికి 50వేల క్వింటాళ్లు ఉత్పత్తి
- ఇప్పటికీ ఏర్పాటుకాని కొనుగోలు కేంద్రాలు




(సత్యంన్యూస్, కొత్తూరు)

కొత్తూరు, సీతంపేట, భామిని మండలాల్లో దాదాపు 4వేల ఎకరాల్లో పత్తిపంట సాగవుతుంది. ప్రభుత్వ మద్దతు ధర రూ.7,500 ఉన్నా దళారీ వ్యవస్థల కారణంగా ఇక్కడి రైతులు క్వింటా పత్తి రూ.6,600 చొప్పున వెయ్యి రూపాయలు నష్టానికి అమ్ముకోవాల్సి వస్తుంది. ఏడాదికి 50వేల క్వింటాళ్ల పత్తిని బహిరంగ మార్కెట్‌కు అమ్ముతున్నారు. ఏడాదికి దాదాపు ఈ మూడు మండలాల్లో రూ.40 కోట్ల పత్తి అమ్మకం, కొనుగోలు జరుగుతుంది. అయినప్పటికీ ఇక్కడ ఎటువంటి కొనుగోలు కేంద్రం గాని, వ్యవసాయ శాఖ సంబంధించిన అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించడం కానీ జరగలేదు. పత్తి విత్తనాల దగ్గర నుంచి అమ్మకం వరకు దాదాపు రూ.50 కోట్ల పైన వ్యాపారం జరుగుతున్నా రైతులకు అవసరమైన పత్తి కొనుగోలు కేంద్రాన్ని, విత్తనాల, పురుగు మందులు, నాణ్యమైనవి లభించక తీవ్ర నష్టానికి గురువుతున్నారు. అధికారులు అటువైపు దృష్టి సారించకపోవడంతో దళారుల చేతిలో బ్లాక్ మార్కెట్లో కొంతమంది నష్టపోతున్నారు. రైతులకు అవసరమైన మేరకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసి నకిలీ విత్తనాలు అరికట్టవలసిన అవసరం ఉంది. రైతులు నష్టపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మూడు మండలాల రైతాంగం కోరుకుంటుంది.



## సుందర శ్రీకాకుళం నిర్మాణంలో

# భాగస్వామ్యం కావాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సుందరశ్రీకాకుళం నిర్మాణంలో నగరవాసులంతా భాగస్వామ్యం కావాలని శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ పివీవీడీ ప్రసాదరావు పిలుపునిచ్చారు. సానావీధి గాంధీనగర్‌లో లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి, స్టార్ వాకర్స్‌క్లబ్ భాగస్వామ్యంతో హోం కంపోస్ట్ ఇంప్లిమెంటేషన్ కార్యక్రమాన్ని కమిషనర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చెత్త నిర్మూలనకు సంబంధించి కార్యక్రమాలు చేపడుతున్నా ప్రజల నుంచి స్పందన అంతంత మాత్రంగానే ఉంటోందన్నారు. నగరంలో తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు డస్ట్‌బిన్లను పంపిణీ చేసినప్పటికీ ప్రజలు వాటిని గృహవసరాలకు వినియోగించుకున్నారని, పంపిణీ చేసిన డస్ట్‌బిన్ల వల్ల ఉపయోగం లేకుండాపోయిందని అన్నారు. వాహనాలను ఏర్పాటు చేసినప్పటికీ పారిశుధ్య కార్మికులు తడి, పొడి చెత్తను కలిపేస్తున్నారని, కొన్నిసార్లు డంపింగ్ యార్డులో కూడా వీటికి కలిపేయడం వల్ల అనుకున్న ఫలితాలు రావడం లేదని ఆరోపణలు ఉన్నాయి. అందుకే మన ఇంటి నుంచే తడి, పొడి చెత్తను వేరు చేసే విధంగా మహిళల్లో చైతన్యం కల్పిస్తూ సహజఎరువు తయారీకి కార్యక్రమం రూపొందించామని చెప్పారు. లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి, స్టార్ వాకర్స్‌క్లబ్ భాగస్వామ్యంతో రెండు డస్ట్‌బిన్లను ప్రతీ ఇంటికి అందజేస్తున్నట్టు వివరించారు. ఒక డస్ట్‌బిన్‌ను ఉచితంగా, మరో డస్ట్‌బిన్‌కు ప్రజల నుంచి రూ.200 సేకరిస్తున్నట్టు చెప్పారు. అలాగే రూ.300 విలువ చేసే ఎరువుల తయారీకి సంబంధించిన పొడిని ఉచితంగా అందజేస్తున్నట్టు వివరించారు. అనంతరం హర్షవల్లి లయన్స్‌క్లబ్ ముద్రించిన ప్రచార, అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బి.సుధీర్, ఏఈ సృజన, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షులు హారికాప్రసాద్, జోనల్ చైర్మన్ శోభారాణి, అధ్యక్షులు వావిలపల్లి జగన్నాథనాయుడు, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, సెక్రటరీ మణిశర్మ, జెసీఐ సెక్రటరీ తమ్మినేని ఉషారాణి, స్టార్ వాకర్స్‌క్లబ్ గవర్నర్ పీజీ గుప్తా, అధ్యక్షులు శాసపు జోగినాయుడు, రవిశంకర్, డాక్టర్ కరణం హారికా, నిహార్‌నాయుడు, దేవీప్రసాద్, వెంకటలక్ష్మీ, నాయుడు, పలు క్లబ్‌ల సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, కాలనీ పెద్దలు, హారికా కన్‌స్ట్రక్షన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.